సాక్షి అనకాపల్లి

శనివారం । 17 । మే । 2025



స్పందన కరవు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు స్పందన కరువైంది. కేవలం 4 వినతులు వచ్చాయి.

ఉష్ణోగ్రతలు

శుక్రవారం

	గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి :	36.6/23.0

రాగల ఐదు రోజుల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త గౌరి తెలిపారు.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

ఉప్పొంగిన దేశభక్తి

- నక్కపల్లిలో ఘనంగా తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మంత్రి అనిత

నక్కపల్లి: వందేమాతరం.. భారత్ మాతాకీ జై.. నినాదాలతో నక్కపల్లి హోరెత్తింది. శుక్రవారం తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. ఉపమాక ఆర్చ్ నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు జరిగిన ఈ ర్యాలీలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు నివాళులర్పిస్తూ.. ఇటీవల విజయవంతమైన ఆపరేషన్ సిందూర్‌కు అందరూ జేజేలు పలికారు. ప్రాణత్యాగం చేసిన వీర సైనికుడు మురళీ నాయక్‌కు సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాజీ సైనికులను సన్మానించారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, తోట నగేష్, గెడ్డం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐఐపీఈ స్నాతకోత్సవం

- 51 మందికి డాక్టరేట్‌లు ప్రదానం

విశాఖ విద్య: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) 5వ స్నాతకోత్సవం శనివారం నోవాటెల్‌లో జరగనుందని ఐఐపీఈ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పి.కె.బానిక్, డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ తెలిపారు. ఐఐపీఈలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. స్నాతకోత్సవానికి హిందుస్థాన్ జింక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, హోల్ టైమ్ డైరెక్టర్ అరుణ్ మిశ్రా ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 51 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో అకడమిక్ ప్రోగ్రామ్ నుంచి ఇద్దరు విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ ప్ర దానం చేస్తామన్నారు. అకడమిక్ సీజీపీఏ, ఎ క్స్‌ట్రా కరిక్యులర్ విజయాల ఆధారంగా ఓవరాల్ ఎక్సలెన్స్ కోసం ఒక ఉత్తమ విద్యార్థికి ప్రతిష్టాత్మక రాష్ట్రపతి బంగారు పతకం లభిస్తుందన్నారు.

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం ధర్మసాగరం ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో 46 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఈ పాఠశాలను రద్దు చేసి విద్యార్థులను 4 కిలోమీటర్ల దూరంలోని వేములపూడి హైస్కూల్‌కు తరలించాలని ప్రభుత్వం ఆదేశించింది. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు, ముఖ్యంగా ఆడపిల్లలు అంత దూరం వెళ్లి చదువుకోగలరా అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనివల్లపేద విద్యార్థులు చదువుకు దూరమై, డ్రాపౌట్‌లుగా మారే ప్రమాదం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో రద్దు చేసిన అనేక **పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది.**



చదువులు తిరోగమనం

- **అప్పర్ ప్రైమరీ స్కూళ్లకు మంగళం**
- **ఉమ్మడి విశాఖ జిల్లాలో 82 స్కూళ్లు రద్దు**
- **ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**
- **అక్కడి విద్యార్థులు సమీప హైస్కూళ్లకు తరలింపు**
- అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా 52 స్కూళ్ల మూత
- దూరం కానున్న హైస్కూల్ చదువులు
- గ్రామాల్లో డ్రాపౌట్ కానున్న విద్యార్థులు

ఉమ్మడి జిల్లాలో 82 స్కూళ్ల రద్దు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 82 ప్రాథమికోన్నత పాఠశాలలను (యూపీఎస్) రద్దు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లాలో 3, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 27, అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా 52 పాఠశాలలు రద్దు కానున్నాయి. ఇకపై ఈ పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రద్దు చేసిన యూపీఎస్‌లలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలకు తరలించాలని ఆదేశిస్తూ, దీనికి సంబంధించిన మ్యాపింగ్‌ను కూడా పూర్తి చేశారు. ఈ విధానం 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానుందని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు.

విశాఖ విద్య : కూటమి ప్రభుత్వం విద్యా**రంగంపై** ప్రయోగాల పేరుతో పాఠశాలలను **మూసివేసేం**దుకు సిద్ధమవుతోందని విమర్శలు **వెల్లువెత్తుతు**న్నాయి. తొమ్మిది రకాల పాఠశాలల పేరుతో పాఠశాల విద్య పునర్నిర్మాణం చేపట్టడం గ్రామీణ ప్రాంత విద్యార్థులను చదువుకు దూరం చేసే చర్యగా ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం సాధారణంగా జరిగే ప్రక్రియ కాగా, ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలను డీగ్రేడ్ చేస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేయడం ద్వారా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యారంగ నిపుణులు అంటున్నారు. విద్యాశాఖ చరిత్రలో ఇలాంటి నిర్ణయాలు ఎప్పుడూ చూడలేదని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

గ్రామీణ విద్యకు విఘాతం

కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించనుంది. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారు. గతంలో దూరం **ఎక్కువగా ఉండటం** వల్ల చాలామంది ఐదో **తరగతి తర్వాత** చదువు మానేసేవారు. అందుకే **గత ప్రభుత్వాలు** ప్రాథమికోన్నత పాఠశా**లలను అం**దుబాటులోకి తెచ్చాయి. కానీ, **ప్రస్తుత ని**ర్ణయంతో గ్రామీణ విద్యార్థు**లకు** హైస్కూల్ చదువులు మళ్లీ దూరమయ్యే ప్రమాదం ఉంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్లు పెరిగే అవకాశం ఉందని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల్లో అసంతృప్తి

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3, 4, **5** తరగతులను సమీప హైస్కూళ్లలో **విలీ**నం చేసి, ప్రైమరీ తరగతులకు స్కూల్ **అసిస్టెంట్ల**తో బోధన ఏర్పాటు చేసింది. దీంతో **విద్యార్థుల**కు నాణ్యమైన విద్య అందింది. అయితే **ఇప్పుడు ప**రిస్థితి మారిపోయింది. ప్రాథమికోన్నత **పాఠశాలలు** రద్దు చేయడంతో 6, 7, 8 తరగతులను సమీప హైస్కూళ్లకు తరలిస్తున్నారు. ఫలితంగా, ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు (స్కూల్ అసిస్టెంట్లు) వేరే చోటుకు బదిలీ కావలసి వస్తోంది. పాఠశాలల పునర్నిర్మాణం వల్ల ఉపాధ్యాయ పోస్టులకు కోత పడుతోంది. యూపీఎస్‌లు రద్దు చేయడంతో స్కూల్ అసిస్టెంట్లు వేర్వేరు హైస్కూళ్లకు బదిలీ కానున్నారు. ఈ పరిణామాలతో ఉపాధ్యాయులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అవిశ్వాసం నోటీసు తిరస్కరణ

- అసంపూర్తిగా ఉందన్న కలెక్టర్
- ఓటమి భయంతోనే తప్పుల తడకగా వేశారంటున్న వైఎస్సార్‌సీపీ



యలమంచిలి మున్సిపల్ కార్యాలయం

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్లపై కూటమి నాయకులిచ్చిన అవిశ్వాసం నోటీసును కలెక్టర్ విజయ కృష్ణన్ తిరస్కరించినట్టు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు శుక్రవారం రాత్రి స్థానిక విలేకరులకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికైన వైస్ చైర్మన్లు బెజవాడ గోవిందరాజు నాగేశ్వరరావు, అర్రెపు నాగ త్రినాథ ఈశ్వర గుప్తాలపై మెజార్టీ లేకపోయినా కూటమి నాయకులు అవిశ్వాసం కోరుతూ జిల్లా కలెక్టరుకు ఈ నెల 8వ తేదీన నోటీసు అందజేశారు. నోటీసులో 16 మంది సంతకాలు ఉన్నాయి. సంతకాల్లో కొన్ని అసంపూర్తిగా, అనుమానాస్పదంగా ఉన్నాయి. నోటీసులో కింద ఇద్దరు వార్డు కౌన్సిలర్ల పూర్తి చిరునామాలు, సంతకాలు ఉండాలి. ఇవేవీ లేకుండానే అవిశ్వాసం కోరుతూ నోటీసు అందజేశారు. అర్రెపు నాగ త్రినాథ గుప్తా పదవీ బాధ్యతలు చేపట్టి ఇంకా నాలుగు సంవత్సరాలు పూర్తి కాలేదు. అయినప్పటికీ నోటీసులో గుప్తా పేరు కూడా చేర్చారు. పట్టణంలో 25 వార్డులుండగా వైఎస్సార్‌సీపీకి 23 మంది, టీడీపీకి ఒకరు, స్వతంత్రులు ఒకరు వార్డు సభ్యులుగా ఉన్నారు. మెజార్టీ లేకపోయినా అవిశ్వాసం కోరుతూ నోటీసు ఇచ్చి ప్రలోభాలతో గెలవాలని కూటమి నాయకులు భావించారు. నోటీసు ఇచ్చిన తర్వాత కూటమికి మద్దతునిస్తున్న వార్డు సభ్యులను ఊటీలో ప్రత్యేక శిబిరానికి సైతం తరలించారు. అయితే వైఎస్సార్‌సీపీకి చెందిన మెజార్టీ సభ్యులు కూటమి నేతల ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కోసం నిజాయతీగా నిలబడ్డారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసం వీగిపోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

వేధింపుల పర్వం : వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తున్న కౌన్సిలర్లను పలు రకాలుగా బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఈరిగిల గణేష్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు సైతం వెనకాడలేదు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో గణేష్ కొత్తగా నిర్మించుకుంటున్న ఇల్లు అక్రమ కట్టడమంటూ మున్సిపల్ అధికారులు నోటీసు అతికించారు. అంతలోనే ఏమనుకున్నారో గోడకు అతికించిన నోటీసును మళ్లీ తొలగించి తమ వెంట తీసుకుపోయినట్టు గణేష్ బంధువులు సాక్షికి చెప్పారు. శనివారం ఉదయం గణేష్ ఇంటిని కూల్చివేయడానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం పట్టణ పోలీసులను బందోబస్తు కల్పించాలని కోరినట్టు సమాచారం. ఇలాంటి కుట్రలను ఎదుర్కొంటామని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు. పట్టణంలో పదుల సంఖ్యలో ఉన్న అక్రమ కట్టడాలన్నింటినీ తొలగించాలని, ఆ తర్వాతే తమ పార్టీకి చెందిన గణేష్ వార్డు సభ్యుని ఇంటికి రావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్ఏఆర్ఎస్ విద్యార్థులకు ర్యాంకుల పంట

అనకాపల్లి: ఏపీ ఈసెట్–2025 అగ్రికల్చర్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ పరీక్షల్లో ఆర్ఏఆర్ఎస్ పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తొలి యాభై స్థానాలలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పరిశోధన స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి.నళిని రాష్ట్రంలో మొదటి ర్యాంక్, జి.భావన 3వ ర్యాంక్, ఇ.సాయి సుదర్శిని 4, ఎం.కీర్తి స్వరూప 5, పి.గురుసాయి 6, కె.సాయి హర్షిణి 7, ఎం.దీపిక 8, జి.మణిరత్నం 9వ ర్యాంక్‌తోపాటు జాహ్నవిరాణి 12వ ర్యాంక్, ఎం.త్రిషాదేవి 13, కె.గ్లోరియా షెరూన్ 14, జి.రక్షిత 17, ఎం.రాహుల్ 23, ఎస్.ప్రిన్స్ 25, ఎల్.లావణ్య 29, పి.దివ్య 36, పి.రేష్మ 39, సీహెచ్.శ్రీనివాసరావు 40, ఎ.దేవి అమృత 42, వైవిఎస్.ప్రశాంత్ 47వ ర్యాంకులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.



నళిని, భావన, సాయి సుదర్శిని, కీర్తి స్వరూప్, గురుసాయి, సాయి హర్షిణి

అరెస్టులు అధికార దుర్వినియోగానికి పరాకాష్ట

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మీడియాతో మాట్లాడుతున్న అమర్‌నాథ్

సాక్షి, అనకాపల్లి: విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ ప్రభుత్వాధికారి కృష్ణమోహన్‌రెడ్డిల అరెస్టు అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వీరిద్దరి అరెస్టులను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. శుక్రవారం అనకాపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జరగనిది జరిగినట్లు దుష్ప్రచారం చేస్తూ.. ప్రతి అంశంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని నిందించడమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. ఎక్కడా ఏ ఆధారాలు లేకపోయినా, లిక్కర్ స్కామ్ అంటూ తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అందులో అందరి పేర్లు చేరుస్తూ, తప్పుడు సాక్ష్యాలను సృష్టిస్తూ, తప్పుడు వాంగ్మూలాలతో కూటమి ప్రభుత్వం లేని లిక్కర్ స్కామ్ కేసు దర్యాప్తు చేస్తోందని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు చేస్తున్న ఈ అనైతిక పని, మొత్తం వ్యవస్థలపైనే ప్రభావం చూపుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ పదే పదే చెబుతున్నట్లుగా, రాష్ట్రంలో యథేచ్ఛగా రెడ్‌బుక్ రాజ్యాంగం కొనసాగుతోందన్నారు. ఈ అరెస్టులపై వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటం చేస్తుందని, తమకు న్యాయస్థానాల మీద నమ్మకం ఉందన్నారు.

దేవరాపల్లి హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లో మూడు రోజుల క్రితం 15 కేజీల బెండకాయల కేటును వ్యాపారులు రూ.30లకు అడగడంతో కలత చెందిన రైతు రోడ్డుపైనే సరకును పారబోసిన సంఘటన గుర్తుంది కదా! లాభాల మాట దేముడెరుగు.. పెట్టుబడి సొమ్ము కూడా రాని దుస్థితి.. కనీసం రవాణా చార్జీలు మిగలని దైన్యస్థితి నెలకొంది. కష్టపడి కూరగాయలు సాగు చేసిన రైతులకు చివరకు నష్టాలే మిగులుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో దళారీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



దేవరాపల్లి హోల్‌సేల్ **మార్కెట్‌కు వచ్చిన కాయగూరలు**

- **దళారుల చేతిలో దగా**

రైతన్నకు కూరగాయాలు



మద్దతు **ధర లేక మనస్తాపంతో రైతు రోడ్డుపై** పారబో**సిన బెండకాయలు (ఫైల్)**

- దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో దళారీల దోపిడీ
- సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర లేకుండా చేస్తున్న వైనం
- కనీస మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ఆవేదనతో రోడ్లపైన కాయగూరలు పారబోస్తున్న దైన్యం

దేవరాపల్లి: సరకు నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి.. బేరమాడే స్థాయిలో రైతులను నిలబెట్టాలి.. ఇది ప్రభుత్వం బాధ్యత. అధికారుల కర్తవ్యం. కానీ దళారీలు నిర్భయంగా దోపిడీ చేస్తున్నారు. కష్టపడి సాగు చేసిన రైతును దోచుకుంటున్నారు. అయినా పట్టించుకునేవారు లేరు. జిల్లాలో అతి పెద్దదైన దేవరాపల్లి హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌కు జిల్లా నలుమూలల నుంచే కాక విశాఖ, విజయనగరం, అల్లూరి జిల్లాల నుంచి వచ్చి సరకు కొనుగోలు చేస్తారు. మార్కెట్‌కు రోజూ సుమారు 10 **టన్నుల కూరగాయలు వస్తాయి. రూ.10 లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. ఇక్కడి హోల్‌సేల్ మార్కెట్‌కు దేవరాపల్లి, వేపాడ, అనంతగిరి మండలాల పరిధిలో 3 వేల ఎకరాల్లో పండించిన కాయగూరలను తీసుకువచ్చి** విక్రయిస్తారు. టమాటా, బీర, బెండ, వంగ, ఆనప, కాకర, చిక్కుడు, బరబాటి, దోసకాయలతోపాటు తోటకూర, పాల కూర, గోంగూర, కొత్తిమీర తదితర ఆకుకూరలను ఇక్కడ పండిస్తారు.

అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే..

స్థానిక కాయగూరల మార్కెట్‌పై ఇటు మార్కెట్ **కమిటీ అధికారులు, అటు పంచాయతీ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో దళారీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మార్కెట్ ద్వారా ఆదాయం పొందుతున్న పంచాయతీ అధికారులు కనీస సౌక**ర్యాలు ఏర్పాటు చేయలేదు. నిలువ నీడ లేకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. ఇక్కడి రైతులకు రైతుబజారు కార్డులు మంజూరు చేయకపోవడం, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది.

కనీస ధర దక్కడం లేదు



అరవై సెంట్లలో సుమారు రూ.16 వేల వరకు పెట్టుబడి పెట్టాను. కాయగూరల దిగుబడి బాగానే ఉంది. కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు లేకుండా చేస్తున్నారు. దీంతో బయట మార్కెట్‌లో కాయగూర ధరలు బాగానే ఉన్నప్పటికీ దేవరాపల్లి మార్కెట్లో కష్టపడి పండించిన రైతుకు కనీస ధర దక్కడం లేదు.

– **అల్లు రాము**, కూరగాయల రైతు, దేవరాపల్లి

దిగుబడి బాగున్నా..



సుమారు ఎకరం విస్తీర్ణంలో వంగ, బీర, ఆనప, దోస కాయలు సాగు చేశాను. దుక్కులు, ఎరువులు, పురుగుల మందులు తదితర పనులకు సుమారు రూ.22 వేల వరకు పెట్టుబడులు పెట్టాను. దిగుబడి కూడా బాగానే ఉంది. కాని దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో మద్దతు ధర ఉండటం లేదు. కనీసం కూలి డబ్బులు కూడా రాలేదు.

– **కొల్లి రమణ**, కూరగాయల రైతు, దేవరాపల్లి

క్లుప్తంగా

పెళ్లి బృందం కారు బోల్తా

- నవ దంపతులతో సహా ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లికి సమీపంలో 16 వ నంబర్ జాతీయ రహదారి పై సారిపల్లి పాలెం వద్ద నూతన దంపతులు ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. ఈ ఘటనలో నూతన దంపతులతో సహా ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కోటవురట్ల మండలం నూతగుంటపాలెం గ్రామానికి చెందిన యామిని, వినయ్‌లకు గురువారం వివాహం జరిగింది. శుక్రవారం అన్నవరంలో సత్య దేవుని వ్రతం చేసుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా సారిపల్లి పాలెం సమీపంలో బస్సును తప్పించబోయి వీరు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో నూతన దంపతులు యామిని, వినయ్‌లతోపాటు వైష్ణవి, ఆశ, వీరబాబు, రోషిణిలకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. ప్రమాదం పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

దాతలు సహకరించినా దక్కని ప్రాణం



మృతి చెందిన మణికంఠ (ఫైల్)

రావికమతం: తీవ్ర అనారోగ్యానికి గురైన విద్యార్థి మణికంఠ చికిత్స పొందతూ విశాఖలో మృతిచెందాడు. మండలంలో కన్నంపేట గ్రామానికి చెందిన సియాద్రి మణికంఠ కొత్తకోట హైస్కూల్‌లో పదోతరగతి చదివి, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. మానవతా వాదులు స్పందించి సహాయం చేసి, విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలని కోరుకున్నారు. అయినా ఫలితం లేకపోయింది. విశాఖలోని కేజీహెచ్‌లో చిక్సిత పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో కన్నంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు నాని, అమ్మాజీ గుండెలవిసేలా రోదించారు. స్నేహితులు, పాఠశాల ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

రేపు విజయనగరంలో కలేకూరి వర్ధంతి

దేవరాపల్లి: ప్రజాకవి, సినీ గేయ రచయిత, అనువాదకుడు, దళిత ఉద్యమకారులు కలేకూరి ప్రసాద్ వర్ధంతిని ఈ నెల 18న విజయనగరంలో నిర్వహించనున్నట్లు ఏపీ బహుజన కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆతవ ఉదయభాస్కర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కాటపల్లి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరంలోని జి.ఎస్.ఆర్. హోటల్‌లో ఉదయం 10 గంటలకు ఈ కార్య క్రమం జరుగుతుందన్నారు. బహుజన మేధావులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని, పూలే, అంబేద్కర్ వాదులంతా వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

మూడు ముక్కలాట



- జీవీఎంసీలో తారస్థాయికి కూటమి రాజకీయం
- టీడీపీ, జనసేన అధిష్టానం దృష్టికి పంచాయితీ
- తమకే ఇవ్వాలంటూ పట్టుబడుతున్న జనసేన
- ససేమిరా అంటున్న టీడీపీ
- ఇరు పార్టీల మధ్య అగ్గిరాజేస్తున్న డిప్యూటీ మేయర్ పోస్ట్

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో కూటమి రాజకీయం తారాస్థాయికి చేరింది. అవిశ్వాసం ద్వారా గత మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లను పదవుల నుంచి తొలగించడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఆ తర్వాత మేయర్‌ను తొలగించి, తెలుగుదేశం పార్టీకి చెందిన పీలా శ్రీనివాస్‌ను కూటమి సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాజాగా డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయానికి వస్తే, కూటమిలో విభేదాలు మొదలయ్యా యి. మేయర్ పదవిని తీసుకున్నందున, డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నారు. ఈ వివాదం తెలుగుదేశం పార్టీ అధిష్టానం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ల దృష్టికి చేరింది.

తమకంటే తమకు కావాలంటూ..

మేయర్ పదవిని తెలుగుదేశం పార్టీ తీసుకున్నందున, పొత్తులో భాగంగా డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించాలని ఆ పార్టీ కార్పొరేటర్లు, పెద్దలు పట్టుబడుతున్నారు. తెలుగుదేశం పార్టీకి డిప్యూటీ మేయర్ పదవి ఇస్తే తాను రాజీనామా చేస్తానని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పార్టీ అధినేతకు బహిరంగంగా లేఖ పంపారు. దీంతో కూటమి రాజకీయం వేడెక్కింది. పొత్తు ధర్మంలో భాగంగా డిప్యూటీ మేయర్ పదవి తమకు కావాలని జనసేన పార్టీ ఎప్పటి నుంచో ఆశిస్తోంది. ఇదిలా ఉండగా, జనసేన పార్టీ నుంచి డిప్యూటీ మేయర్ పదవి కోసం ఇటీవలే వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలో చేరిన పెద్దిరెడ్డి ఉష, వంశీరెడ్డి, మూసిపోగు

నువ్వా..నేనా?

డిప్యూటీ మేయర పదవిపై పార్టీల అధినాయకులు తేల్చకపోవడంతో ఇరు పార్టీల్లోనూ ఆశావాహుల సంఖ్య పెరిగింది. టీడీపీలో 10 మంది వరకు ఈ పదవి కోసం పోటీ పడతుండగా, జనసేనలో ఉన్న వారంతా (ఒక్క మూర్తి యాదవ్ తప్పా..ఎందుకంటే మూర్తి యాదవే తనను మినహాయించి ఎవరికై నా ఇవ్వాలని పవన్ కల్యాణ్‌కు పంపిన లేఖలో పేర్కొన్నారు) రేసులో ఉన్నట్టు తెలిసింది. ఎవరి స్థాయిలో వారు సీనియర్ల ద్వారా అధినాయకుడి ఆశీస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా ఇరు పార్టీల నుంచి ఇద్దరు పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. టీడీపీ నుంచి 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుకు డిప్యూటీ మేయర్ కట్టబెట్టాలని ఆ పార్టీలో పలువురు కార్పొరేటర్లు భావిస్తూ..ఆ పేరు ప్రతిపాదించినట్టు సమాచారం. ఇక జనసేన విషయానికొస్తే..ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మేయర్‌గా టీడీపీ నేత ఉండడంతో డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ఈ పదవిని జనసేన వదులుకునే ప్రసక్తే లేదంటూ తెగేసి చెబుతున్నారు. జనసేన నుంచి ఎందరో ఆశావాహులున్నా..ఎమ్మెల్యేలు మాత్రం ఉషశ్రీ పేరు పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఏది ఏమైనా కూటమిలో డిప్యూటీ మేయర్ పదవి పెద్ద రాద్ధాంతం చేస్తోంది.

అంత సీన్ లేదు..

తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్‌కే డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలంటూ సాక్షాత్తు నూతనంగా ఎన్నికైన మేయరే అధిష్టానానికి లేఖ పంపినట్టు భోగట్టా. వీరిద్దరి మధ్య నేను అర్హురాలినేనంటూ బీజేపీ కార్పొరేటర్ కూడా రేస్‌లో ఉన్నట్టు సమాచారం. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే కూటమిలో అంతర్గత తగాదాలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పడానికి ఈ కుమ్ములాటలే నిదర్శనం.

మేరీజోన్స్, ఇండిపెండెంట్‌గా గెలిచి ఆ పార్టీలో చేరిన మహ్మద్ సాదిక్, కందుల నాగరాజుతో పాటు ఆ పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి కూడా పోటీలో ఉన్నారు.

తాడోపేడో..

డిప్యూటీ మేయర్ ఒక్క పోస్టు కోసం రెండు పార్టీలు పట్టువిడవకుండా ఉన్నాయి. ఈ విషయంలో తేల్చుకోవడానికి సిద్ధపడుతున్నాయి. డిప్యూటీ మేయర్ తమకే ఇవ్వాలని జనసేన గట్టిగా పట్టుబడుతుండగా, తెలుగుదేశం పార్టీ మాత్రం ఈ పోస్టును వదులుకోవడానికి సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఈ పోస్టు కోసం ఈ నెల 19న ఎన్నిక జరగనుంది. మేయర్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకోవడంతో, డిప్యూటీ మేయర్ తమకు కేటాయించాలని జనసేన కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. లేనిచో రాజీనామా చేస్తామని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ శుక్రవారం పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు లేఖ పంపడంపై కూటమిలో విభేదాలు తారాస్థాయికి చేరాయి.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

సోమలింగపాలెంలో పెళ్లింట విషాదం



మృతుడు చిన అప్పలనాయుడు (ఫైల్)

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో విషాదం చోటు చేసుకుంది.సమీప బంధువైన యువకుడి వివాహ వేడుకలో భాగంగా భోజనాల దగ్గర విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అదే గ్రామానికి చెందిన కొయిలాడ చిన అప్పలనాయుడు(27) మృతి చెందాడు.ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.వివరాలు... గురువారం రాత్రి సోమలింగపాలెంలో ఒక వివాహ వేడుకలో భోజనాలు చేసే చోట అదనంగా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడం కోసం లైటింగ్ వేసే వ్యక్తికి సహాయం చేసే నిమిత్తం చిన అప్పలనాయుడు షామియానాలు వేసే ఇనుపరాడ్డును అక్కడకు తీసుకొస్తుండగా పైన ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలాయి.దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్పృహ కోల్పోయిన యువకుడిని హుటాహుటిన యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యుడు తెలిపారు. అప్పటివరకు ఎంతో ఆనందంగా జరుగుతున్న వివాహ వేడుకలో ఊహించని రీతిలో అపశ్రుతి చోటు చేసుకోవడంతో ఒక్కసారిగా బంధువులు,గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.మృతుడికి ఆరు నెలల క్రితమే వివాహమైంది.భార్య గర్భవతి.ఈ ఘటనతో ఆ వివాహాన్ని వధూవరుల కుటుంబ సభ్యులు అన్నవరం దేవస్థానంలో చేయించారు. మృతి చెందిన యువకుడు తండ్రి ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

అనకాపల్లి: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ టీవీ సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినప్పటికీ అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకుని విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. వేసవి కారణంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రతి శుక్రవారం సబ్ స్టేషన్లు, లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నామన్నారు. గురువారం రాత్రి అనకాపల్లి జిల్లాలో సంభవించిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి మాడుగుల మండలంలోని సత్యవరం గ్రామంలో 20 ఎల్‌టీ స్తంభాలు, 7 హెచ్‌టీ స్తంభాలు నేలకొరిగాయన్నారు. సత్యవరంతో పాటు డి.గొట్టివాడ, సాగరం, కొత్తవలస, కె.వేలంపాడు గ్రామాల్లోని 1600 సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. యుద్ధప్రాతికపదిన తమ సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

మామిడిలో పండు ఈగ ఉధృతి

అనకాపల్లి: మామిడిలో పండు ఈగ ఉధృతి పెరిగే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాలిపోయిన పండ్లను ఏరి నాశనం చేయాలని సూచించారు. పండుఈగ నివారణకు ప్లాస్టిక్ పళ్లెంలో మిథైల్ యూజినాల్ 2 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి తోటలో వేలాడదీయాలని, మార్కెట్‌లో లభ్యమయ్యే పండు ఈగను ఆకర్షించే బుట్టలను ఎకరాకు 5 చొప్పున 5-6 అడుగుల ఎత్తులో కొమ్మలకు కట్టాలన్నారు. వర్ష సూచన ఉన్నందున వాతావరణ పరిస్థితులను గమనించి వరి కోతలు కోయాలని తెలిపారు. ఖరీఫ్‌కి ముందు జనుము (ఎకరానికి 12-15 కిలోలు), జీలుగ (ఎకరానికి 10-12 కిలోలు), పిల్లిపెసర (ఎకరానికి 10-12 కిలోలు), పెసర (ఎకరానికి 8-10 కిలోలు) వంటి పచ్చి రొట్ట పైరులను వేసుకోవడానికి ఇదే అనువైన సమయమని పేర్కొన్నారు.వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవడానికి ఇది సరైన సమయమని,లోతు దుక్కులు చేయడం వల్ల కలుపు సమస్యను అధిగమించవచ్చని, పంటను నష్టపరిచే కీటకాలు, తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. చెరకులో అంతరకృషి చేసుకోవాలని, వర్షాధరంగా చెరకు సాగు చేసుకునే రైతులు పొలంలో పచ్చిరొట్ట విత్తనాలను జల్లుకుని, చెరకు నాటే ముందు పొలంలో కలియ దున్నినట్టయితే దిగుబడులు పెరుగుతాయని తెలిపారు.

మాతా, శిశు మరణాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

- అబార్షన్ చేస్తున్న ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలో మాతా, శిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సర్వే, మాతా, శిశు మరణాలు, వ్యాధి నిరోధక టీకాలు, మలేరియా, డెంగ్యూ వంటి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన దంపతులు, గర్భిణులు, శిశువుల రిజిస్ట్రేషన్ సక్రమంగా జరగాలన్నారు. హైరిస్క్ కేసులు, బరువు తక్కువ గల పిండాల కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించి ఆస్పత్రులకు తరలించాలన్నారు. తదుపరి సమీక్షలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో హాజరుకావాలని అధికారులకు ఆమె సూచించారు. అబార్షన్లు అధికంగా చేస్తున్న ఆస్పత్రులపై నిఘా పెట్టాలని, అబార్షన్లకు గల కారణాలపై నివేదిక అందించాలన్నారు. శిశువులకు వ్యాక్సినేషన్ సకాలంలో పూర్తి చేసి, వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. గత సంవత్సరం 19,781 జననాలకు 133 మంది శిశువులు, 1 నుంచి 5 సంవత్సరాల పిల్లలు 16 మంది మరణించారని, 15 మాతృ మరణాలు సంభవించాయని కలెక్టర్ వివరించారు. ఇక నుంచి మరణం సంభవించిన ప్రతి కేసు నివేదికను వెంటనే అందజేయాలన్నారు. గ్రామాల్లో ఆశా, ఏఎన్ఎం కార్యకర్తలు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కువగా సిజేరియన్ నిర్వహిస్తున్న ఆస్పత్రుల వివరాలు సేకరించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులను ఆస్పత్రులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, 104 వాహనాల ద్వారా ప్రజలకు సక్రమంగా సేవలు అందేలా వైద్యాధికారులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఎం.శాంతిప్రభ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వి.రమణ, డీఐవో డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, డీపీఎంవో డాక్టర్ ప్రశాంతి, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

మట్టి తిని బతకాలా ?



నోట్లో మట్టి పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలతో వెంకన్న

ఉపాధి వేతనదారుల వినూత్న నిరసన

చీడికాడ: ఉపాధి హామీ పథకం బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఉపాధి హామీ పథకం కూలీలు శుక్రవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని అర్జునగిరిలో ఉపాధి వేతనదారులు నోటిలో మట్టిని పెట్టుకుని... దానిని తింటున్నట్టు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న వీరికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 20వ తేదీ నుంచి ఇప్పటి వరకు ఉపాధి బకాయిలు చెల్లించలేదన్నారు. వేతనదారులు మట్టితిని బతకాలా అని ప్రశ్నించారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా జీతాలు చెల్లించలేదన్నారు. కూలీలకు వెంటనే బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

హైవే పక్కన గ్యాస్ ట్యాంకర్ బోల్తా



రేగుపాలెం వద్ద బోల్తా పడిన ట్యాంకర్ నుంచి లీకవుతున్న గ్యాస్

- భారీగా లీకైన గ్యాస్
- పరుగులు తీసిన వాహనచోదకులు, స్థానికులు

యలమంచిలి రూరల్: యలమంచిలి మండలం రేగుపాలెం సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న టీఎస్ 06 యూసీ0645 నంబరు గల గ్యాస్ ట్యాంకర్ రేగుపాలెం సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడిపోయింది. దీంతో ట్యాంకర్ నుంచి భారీగా గ్యాస్ లీకైంది. తెల్లని గ్యాస్ పక్కనున్న పొలాలు, కాలువ వైపునకు వ్యాపించింది. ఇది చూసిన వాహనచోదకులు, చుట్టు పక్కల వారు భయంతో పరుగులు తీశారు. అయితే లీకైన వాయువు శీతల పానీయాల్లో ఉపయోగించే కార్బన్ డయాక్సైడ్‌గా లారీ డ్రైవర్, క్లీనర్ చెప్పడంతో ప్రమాదకరం కాదని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పలువురు వాహన చోదకులు లీకవుతున్న గ్యాస్‌కు ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. సంఘటన స్థలానికి వెళ్లిన హైవే పోలీసులు లీకవుతున్న గ్యాస్‌తో ఎవరికీ ప్రమాదం లేదని, భయపడవద్దని చెప్పారు. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ సతీష్‌కుమార్ హఠాన్మరణం



సతీష్‌కుమార్(ఫైల్)

చింతపల్లి/రావికమతం: లంబసింగి గ్రామానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్, స్థానిక వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కంతా జాహ్నవి భర్త సతీష్‌కుమార్(46)హఠాన్మరణం చెందారు. కుటుంబీకులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సతీష్‌కుమార్ రావికమతం మండలం కొత్తకోట ఎస్‌బీఐ ఫీల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ నర్సీపట్నం శారదానగర్‌లో నివాసముంటున్నారు. గురువారం ఉద్యోగ రీత్యా సతీష్‌కుమార్, భార్య జాహ్నవి చింతపల్లి వచ్చి విధులు ముగించుకుని స్వగ్రామం చౌడుపల్లిలో బస చేశారు. శుక్రవారం ఉదయం బ్యాంకుకు బయలు దేరే సమయంలో ఛాతి నొప్పి రావడంతో ఆయన కుప్పకూలిపోయాడు. వాచ్‌మన్, స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే సతీష్‌కుమార్ మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామం లంబసింగికి తరలించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. పిన్న వయస్సులో సతీష్ మృతి చెందడంతో ఇటు చౌడుపల్లి, లంబసింగిలో విషాదఛాయలు అలముకున్నాయి. సతీష్‌కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వుషు పోటీల్లో అక్కిరెడ్డిపాలెం క్రీడాకారులకు పతకాలు



వుషు పోటీల్లో బంగారు పతకాలు సాధించిన అక్కిరెడ్డి పాలెం జిమ్‌కు చెందిన విద్యార్థులు

అనకాపల్లి టౌన్: మండలంలోని అక్కిరెడ్డి పాలెం ఫిట్‌నెస్, బాక్సింగ్ క్లబ్‌కు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి వుషు పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. కర్నూల్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు సబ్ జూనియర్,జూనియర్ బాలబాలికల చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. సబ్ జూనియర్ కేటగిరీలో జిమ్ నుంచి ఎనిమిది మంది పాల్గొనగా 42 కిలోల విభాగంలో ఎస్.వార్షిక్, 48 కిలోల విభాగంలో గోవర్ధన్, 60 కిలోల విభాగంలో బి.దుర్గాప్రసాద్ బంగారు పతకాలు సాధించారు. జూనియర్ కేటగిరి 48 కిలోల విభాగంలో ఇ.లక్ష్మిత్, 60 కిలోల విభాగంలో ఎ.వరప్రసాద్ బంగారు పతకాలు సాధించగా , 52 కిలోల విభాగంలో ఎస్.తులసీరామ్ రజతం, 56 కిలోల విభాగంలో పి.శశి, 65 కిలోల విభాగంలో వై.వినయ్ కాంస్య పతకాలు సాధించారు. వీరందరూ ఈ నెల 26 నుంచి 31 వరకు తమిళనాడులో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు జిమ్ కోచ్‌లు అరుణ, హరీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 20 మందికి గాయాలు

పెళ్లికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



ఉగ్గినపాలెం వద్ద జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు అద్దాలు

కశింకోట: మండలంలో ఉగ్గినపాలెం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లి బృందానికి చెందిన సుమారు 20 మంది గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. అన్నవరం నుంచి విశాఖలోని వేపగుంట వెళుతున్న సింహాచలం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు.. ముందు వెళుతున్న ప్రైవేటు బస్సును వెనుకగా ఢీకొంది. దీంతో ఆర్టీసీ బస్సులోని సుమారు 20 మందికి స్వల్పగాయాలయ్యాయి. వారిలో కొంతమందిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి అదే బస్సులో తరలించగా, అక్కడ ప్రాథమిక చికిత్స పొంది ఇళ్లకు వెళ్లిపోయారు. వారి వివరాలు తెలియరాలేదు. వేపగుంటకు చెందిన యువతి వివాహం అన్నవరంలో జరగడంతో దానికి బంధు మిత్రులు ఆర్టీసీ బస్సును లీజుకు తీసుకొని వెళ్లి, తిరుగు ప్రయాణంలో విశాఖ వెళుతుండగా మార్గమధ్యంలో ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో సుమారు 40 మంది ఉన్నట్లు సమాచారం. ప్రమాదంలో బస్సు ముందు అద్దాలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో తిమిరాం విద్యార్థి సత్తా



పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన హేమ చంద్రకుమార్

దేవరాపల్లి: మండలంలోని తిమిరాం గ్రామానికి చెందిన ఎలిశెట్టి హేమ చంద్రకుమార్ పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు సాధించి సత్తా చాటాడు. ఓ ప్రైవేటు విద్యా సంస్థలో పదో తరగతి చదివిన విద్యార్థి ఇటీవల సీబీఎస్ఈ ఫలితాల్లో 477 మార్కులు సాధించాడు. ఏపీఆర్‌జేసీలో 132 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంక్ సాధించాడు. పాలిసెట్ ప్రవేశ పరీక్షలో 120కు 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్‌తో మెరిశాడు. హేమచంద్రకుమార్ తండ్రి సూరిబాబు ఆటో డ్రైవర్ కాగా.. తల్లి బహుమతి గృహిణి.

క్లుప్తంగా

ప్రమాదకరంగా ఇనుప స్తంభం


తహసీల్దార్ కార్యాలయం జంక్షన్‌లో ఇనుప స్తంభ భాగం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రోడ్డు జంక్షన్‌లో విద్యుత్ ఇనుప స్తంభం కింద భాగం ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఇనుప స్తంభం పాడైపోతే దానిని అసంపూర్తిగా తొలగించి మరొక కొత్త స్తంభాన్ని వేశారు. పాత స్తంభం మిగిలిన భాగాన్ని జానెడు ఎత్తులో రోడ్డుపై వదిలేశారు. దాంతో జంక్షన్‌లో మలుపు తిరిగే వాహనాలు పక్కనే ఉన్న కొత్త స్తంభాన్ని ఢీకొంటున్నాయి. రాత్రిళ్లు మలుపు తిరిగేటప్పుడు స్తంభం పైభాగం గుండా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభం భాగాన్ని పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.16.35 కోట్లతో తాగు, సాగునీటి పనులు


చిన్నబాబు కాలనీ హెడ్ వాటర్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

అనకాపల్లి: జోనల్ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సాగు, తాగునీటి పనులు నిమిత్తం రూ.16.35 కోట్లు మంజూరు చేశామని అనకాపల్లి జనసేన పార్టీ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో చిన్నబాబు కాలనీ వద్ద హెడ్ వాటర్ వద్ద ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఒక్కొక్క మనిషికి 70 లీటర్ల మాత్రమే మంచినీరు సరఫరా అవుతుందన్నారు. ఈ పనులు పూర్తయితే ఒక వ్యక్తికి 135 లీటర్లు మంచినీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వాటర్ వర్క్స్ ఈఈ సూరిశెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండించాలని కోరుతూ అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. బీజేపీ నాయకుడు జి. రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, పంచాయతీ కార్యదర్శి ఎన్. సత్యారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ప్రకృతి వ్యవసాయం సాగు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 331 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,140	4,800
రెండో రకం	3,960	4,300
మూడో రకం	3,690	3,700

అనకాపల్లి సినిమాలు

లెవన్	:రాజా
అర్జున్ సన్ఆఫ్ వైజయంతి	:సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌లీ	: సత్యనారాయణ స్క్రీన్-2
హిట్-3	:పర్తిసాయి
సింగిల్	:షిర్డీసాయి
మన కుటుంబం	:వెంకటేశ్వర
అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి	:శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్	:రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 396 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు, బీ పాజిటివ్-14, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

ప్రకృతి వ్యవసాయానికి జై

- పెరుగుతున్న ప్రకృతి వ్యవసాయం
- రసాయనాలకు దూరంగా పంటల సాగు
- మార్కెట్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్


ప్రకృతి సాగులో ఎరువులుగా వినియోగిస్తున్న ఘన జీవామృతం



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న మినుము పంట


ప్రకృతి వ్యవసాయంపై రైతులతో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది


ప్రకృతి వ్యవసాయి పద్ధతులపై రైతులకు అవగాహన చేస్తున్న సిబ్బంది

తుమ్మపాల: కోవిడ్ తర్వాత వ్యవసాయంలో మార్పులు మొదలయ్యాయి. వ్యవసాయ ఉత్పత్తుల్లో రసాయనాలు వాడకమే అనారోగ్యానికి కారణమని తెలుసుకున్న ప్రజలు కోవిడ్ గుణపాఠంతో ప్రకృతి వ్యవసాయం దిశగా పరిపక్వత పొందారు. రోజు వారి తినుబండారాల నుంచి మూడు పూటల తినే బియ్యం, పప్పులు, కూరగాయలు ప్రకృతి సేద్యం ద్వారానే పొందేందుకు ఇష్టపడుతున్నారు. ప్రతి ఇంటి పెరట్లో నుంచి ప్రారంభించిన ప్రకృతి సాగు క్రమక్రమంగా రైతులే ప్రకృతి వ్యవసాయం చేసే స్థితికి మార్పు చేపట్టారు. ఈ క్రమంలో రెండేళ్లలో ప్రతి పల్లెలోను రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. వారికి ప్రభుత్వం ప్రోత్సాహకంగా నిలవడంతో సాగు ద్వారా వచ్చిన ఉత్పత్తిని మెరుగైన ధరలకే మార్కెట్ చేయగలుగుతున్నారు.

అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట....

ప్రస్తుత తరుణంలో ఎరువులకు అధిక డబ్బులు వెచ్చించాల్సి వస్తుంది. అదే ప్రకృతి వ్యవసాయంలో అయితే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వచ్చే పంటలు సాగు చేయవచ్చు. దీంతో రైతన్నల చూపు ప్రకృతి వైపు మరలుతోంది. అధికారుల ప్రోత్సాహంతో రైతన్నలు సైతం ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. తద్వారా అధిక ఆదాయం గడిస్తున్నారు. ముఖ్యంగా ఎరువులు లేకుండానే కేవలం ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించేందుకు రైతన్నలు ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా వరి, కూరగాయాలు, పైర్లు, ఆకుకూరలు సాగులో ముందుంటున్నారు. మామిడి, జీడి, వంటి ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు అంతర పంటలుగా వేరుశనగ, మినుము, రాగులు వంటి పంటలు సాగు చేసి అధిక ఆదాయం గడిస్తున్నారు. ఈ పద్ధతుల ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వస్తుంది. మార్కెట్లోను ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి గిరాకీ లభిస్తుంది. ధరలతో సంబంధం లేకుండా వినియోగదారులు పంటలను కొనుగోలు చేస్తున్నారు.

కషాయాలు తయారీ....

మండలంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని, పలు పంటల్లో అంతర పంటల సాగు, వరి అనంతరం మినప వంటి అపరాల సాగు చేసుకునేలా అధికారులు చైతన్యవంతం చేస్తున్నారు. రైతన్నలు సైతం ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. అవకాశం ఉన్న చోట్ల ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రైతులు తమ పొలాల్లో సగం విస్తీర్ణంలోనైనా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించేందుకు ముందుకు వస్తున్నారు. మరి కొన్నిచోట్ల ఇంటి పెరట్లో వారికి సరిపడే కూరగాయలు, పండ్ల మొక్కలు నాటించి 365 రోజులు దిగుబడులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ద్రవ, ఘన జీవామృతం తయారీపై రైతుల కల్లాలోనే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వచ్చి అవగాహన చేస్తున్నారు.

12 గ్రామాల్లో 2,457 ఎకరాల్లో సాగు

అనకాపల్లి మండలంలో 2,900 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేసేందుకు సిద్ధమయ్యారు. మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు వారితో మమేకమై వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం 12 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకొచ్చి సాగు చేపడతున్నారు. అధిక శాతం వ్యవసాయ ఆధారంగా జీవించే గ్రామాలు దిబ్బపాలెం, సీతానగరం, తరరంపూడి, వెంకుపాలెం, మెట్టపాలెం, కుంచంగి, రొంగలివానిపాలెం, సుందరయ్యపేట, తుమ్మపాల, మామిడిపాలెం, పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం గ్రామాల్లో 2,457 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం నమోదు జరిగింది. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం లక్ష్యంగా అడుగులు వేయడంతో మండలంలో మిగిలిన గ్రామల్లోనూ రైతులను సమాయత్తం చేసేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎరువులు లేకుండానే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడించేలా సాగు చేయవచ్చని వివరిస్తున్నాం. రైతుల నుంచి స్పందన చాలా బాగుంది. చాలా మంది రైతులు తమ పొలాల్లో సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. రెండేళ్లుగా రైతుల్లో మంచి మార్పు కనిపిస్తోంది.

– మజ్జి సత్యారావు, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి, అనకాపల్లి మండలం

ఎన్నికల హామీని అమలు చేయాలి


నెహ్రూ చౌక్‌లో సీహెచ్‌వోల మానవహారం

అనకాపల్లి: గ్రామాల్లో ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌వో) సమస్యలు పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నేటి వరకూ అమలు చేయలేదని రాష్ట్ర గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.వి. శ్రీనివాసరావు తెలిపారు. సీహెచ్‌వోల సమ్మె శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి నెహ్రూ చౌక్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం, జాబ్‌చార్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు భవాని, సంధ్య, నూకలమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సర్వే అడ్డుకున్న రైతులు


అధికారుల సర్వేను అడ్డుకున్న రావిపాలెం రైతులు

అచ్యుతాపురం రూరల్: తమ భూములకు నోటీసులు ఇచ్చి, రేటు నిర్ణయించాకే సర్వే చేయాలని దొప్పెర్ల రెవెన్యూ పరిధి రావిపాలెం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బార్క్ రోడ్డు నుంచి మేకరాశి కొండ వరకూ ఏర్పాటు చేయదలచిన 60 అడుగుల మేర రహదారి పనులను అడ్డుకున్నారు. రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా భూముల్లోకి రెవెన్యూ అధికారులు చొరబడటంపై తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి రైతులతో చర్చించి వారి అనుమతితో భూముల్లో సర్వేలు నిర్వహించాలని కోరారు.

పరిశుభ్రతతో డెంగ్యూను తరిమి కొట్టాలి


నాలుగురోడ్ల జంక్షన్‌లో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర


తుమ్మపాలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

- జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర

అనకాపల్లి టౌన్: పరిశుభ్రతతో డెంగ్యూ వ్యాధిని తరిమి కొట్టవచ్చని జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర కోరారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ ర్యాలీ మలేరియా ఆఫీస్ నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు కొనసాగింది. డెంగ్యూపై అవగాహన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ డెంగ్యూ మానవాళికి చాలా ప్రమాదకరమన్నారు. ఈ వ్యాధి నివారణకు ముఖ్యంగా మూడు పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎం శాంతి, సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు. తుమ్మపాలలో పీహెచ్‌సీ డాక్టర్ వాణి జగదీశ్వరీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కుండీలు, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా నోడల్ అధికారి బి. సంగమ్, సీహెచ్‌వో శారద, హెల్త్ ఎడ్యుకేటర్ బి. మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


పరిశుభ్రతతో డెంగ్యూ నివారణ

కశింకోట: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ వ్యాధిపై అవగాహన కలిగిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట పీహెచ్‌సీలో వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. డెంగ్యూ వ్యాధి నివారణకు అంతా కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. దోమల వృద్ధికి నీటి నిల్వలు కారణమవుతాయన్నారు. నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమ తెరలు వాడటం వల్ల డెంగ్యూ నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు రావడం, వాంతులు అవ్వడం, చర్మంపై దద్దుర్లు ఉంటే పీహెచ్‌సీల్లో డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముందుగా డెంగ్యూ వ్యాధిపై ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారి ఎ. మనీషా ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధిపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగ్యూ నివారణకు పరిశుభ్రత పాటించాలని, దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.ఎస్.ఆర్.కె. నరసింహారావు, హెచ్.వి.ఆర్. వెంకటలక్ష్మి, ఏఎన్ఎం సత్యదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


డెంగ్యూ వ్యాధి నివారణకు వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ


తాళ్లపాలెం పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని డిమాండ్


అసంపూర్తిగా ఈగలవారి వీధిలో డ్రైనేజీ పనులు

అనకాపల్లి: గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే చర్యలు చేపట్టాలని, వర్షాకాలం వచ్చినట్లయితే తీవ్ర ఇబ్బందులు పడనున్నారని సీపీఐ డివిజన్ నాయకుడు కోన లక్ష్మణ తెలిపారు. సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామం ఈగలవారి వీధిలో అసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని శుక్రవారం స్థానికులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధిలో రెండు మాసాల క్రితం పనులు ప్రారంభించి నేటికీ పూర్తి చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. చిన్నారులు, వృద్ధులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో డ్రైనేజీ పనులు చేట్టాలని కోరారు. గ్రామస్తులు ఈగల అరుణ, ముత్యాలమ్మ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ


గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో గౌరీ పరమేశ్వరుల 204వ ఊంజల్ సేవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. అర్చకులు అంపోలు గోపాల కృష్ణశర్మ, పాందూరు సూర్యనారాయణ శాస్త్రి, కొణతాల రామ చంద్రకళ, కొణతాల పవన్ కుమార్, మేఘన దంపతులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గౌరీ గీత మహిళా మండలి, సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని వ్యవస్థాపకురాలు పెంతకం శెట్టి సుజాత ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల వెంకట సత్యప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

పట్టపగలే గ్రావెల్ తవ్వకాలు


పాటిపల్లి కేజీబీవీ సమీపంలో పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

మునగపాక: అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతున్నామంటూ అధికారులు ఊకదంపుడు ప్రచారం చేస్తున్నారు. ఇందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక అక్రమ గ్రావెల్ తవ్వకాలు ఊపందుకున్నాయి. తాజాగా మండలంలోని పాటిపల్లి కేజీబీవీకి వెళ్లే దారిలో పొక్లెయిన్ సాయంతో పట్టపగలే గ్రావెల్ తవ్వుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత

పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన కొంకిపూడి నాగేశ్వరరావు కుటుంబానికి ప్రమాద బీమా నుంచి రూ.20 లక్షలు మంజూరైంది. 2023 డిసెంబరు 29న కందిపూడి చెరువు వద్ద భారీ క్రేన్ ఢీకొన్న ప్రమాదంలో అతడు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో అకౌంట్ కలిగిన ఉన్న అతను ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌లో వెయ్యి రూపాయలతో ప్రమాద బీమా పాలసీ తీసుకున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మరణించడంతో శుక్రవారం బ్యాంకు శాఖలో నాగేశ్వరరావు భార్య పద్మావతికి రూ.20 లక్షల చెక్కును అనకాపల్లి రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్ చంద్ర అందజేశారు.

హై ఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

కశింకోట: గవరపేటలో శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా హై ఓల్టేజీతో విద్యుత్ సరఫరా కావడంతో పలు ఇళ్లలో టీవీ, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఇతర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. దీంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ప్రకటించిన మేరకు మరమ్మతుల నిమిత్తం ఉదయం 10 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ సమయంలో విద్యుత్ హెచ్చు, తగ్గులతో సరఫరా కావడంతో ఉపకరణాలు కాలిపోయాయని స్థానికులు వాపోయారు. కొందరి ఇళ్లలో నిప్పులు వచ్చి భయాందోళనకు గురి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎక్కువ సమయం విద్యుత్ వినియోగించడానికి స్థానికులు భయానికి గురయ్యారు. ఇదిలా ఉండగా శుక్రవారం తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అసలే వేసవి కాలం కావడంతో ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు విద్యుత్ అంతరాయాలతో మరింత ఇబ్బంది చెందారు.

22 నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు


నాటిక పోటీల కర పత్రాల ఆవిష్కరణ

కశింకోట: స్థానిక గవరపేటలో ఈ నెల 22 నుంచి నాలుగు రోజులపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు తెలిపారు. పరిషత్ ప్రతినిధులతో కలిసి నాటిక పోటీల కర పత్రాలను శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాట రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నాలుగు దఫాలుగా వీటిని నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి హనుమజ్జయంతి పురస్కరించుకొని ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 10 నాటికలను ఎంపిక చేసి ప్రదర్శనకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ నెల 22న రాత్రి 9 గంటలకు స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద విశాఖపట్నం తెలుగు కళా సమితికి చెందిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక, అదే రోజు రాత్రి 10.15 గంటలకు కాకినాడకు చెందిన బీవీకే క్రియేషన్స్ వారి తితిక్ష నాటిక, 23న రాత్రి 8.45 గంటలకు కరీంనగర్ చైతన్య కళా భారతి బృందంతో చీకటి పువ్వు, రాత్రి 10 గంటలకు గుంటూరులోని అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక, 11.15 గంటలకు విజయవాడ గురజాడ కళా మందిర్ వారి మహా ప్రస్థానం నాటిక, 24న రాత్రి 8.45 గంటలకు హైదరాబాద్‌లోని గోవాడ క్రియేషన్స్ వారి మూల్యం, 10 గంటలకు కొలకలూరులోని సాయి ఆర్ట్స్ వారి జనరల్ బోగీలు, 11.15కు పెందుర్తి నటరాజ డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'శిథిల జీవి', 25న రాత్రి 9 గంటలకు గుడివాడ కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి 'ద్వార బంధాలు చంద్రయ్యనాయుడు' చారిత్రక నాటకం, 10.15 గంటలకు విశాఖపట్నం జ్యోతి సరళ స్మారక కళా పరిషత్ వారి 'అనగనగా ఒక రాజు' నాటికను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆళ్ల మహాలక్ష్మి నాయుడు, యల్లపు మోహన్, మళ్ల రంగ, సిరిపల్లి సత్యనారాయణ, ఆట్టోజి బ్రహ్మాజీ, భీశెట్టి రాము, కొణతాల శ్రీను, బొడ్డేడ సూకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పెందుర్తి పోలీసులు

పెందుర్తి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మంచినీటి పథకం వాటర్ ట్యాంక్ ఎక్కి దూకేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని, అతడ్ని రక్షించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పెందుర్తి మండలం జంగాలపాలెం వద్ద శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన బోని సత్యం(60)కు భార్య, కుమార్తె, అల్లుడితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం మరోసారి వీరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో చింతలపాలెనికి సమీపంలోని జంగాలపాలెంలో వాటర్ ట్యాంక్ ఎక్కి దూకడానికి సిద్ధమయ్యాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాలతో సమీపంలోనే ఉన్న బ్లూకోట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ హుటాహుటిన అక్కడకు వెళ్లి, సత్యంను చాకచక్యంగా కిందికి దించేలా చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. బంధువులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

CHANGE OF NAME & DOB

I, (Old) PARANTI NAIDU, Date of Birth 01/07/1951, Father of No. 15332215X Havildar SRINU RAJU Residing at Door No. 2-169/5, Salim Mandir Church Street, Laxmi Garden, Kasimkota (Village / Post and Mandal) Anakapalli (Dist.), Andhra Pradesh (State), Pin-531031, have changed my Name and Date of Birth to (New) VIRANTI NAIDU and 20/01/1956 accordingly vide affidavit dated 15/05/2025 sworn before Advocate & Notary B. Balarama Srinivasa Rao, Anakapalle, Andhra Pradesh-531001.

CHANGE OF NAME & DOB

I, (Old) SATYAWATI Date of Birth 01/07/1954, Mother of No. 15332215X Havildar SRINU RAJU Residing at Door No. 2-169/5, Salim Mandir Church Street, Laxmi Garden, Kasimkota (Village / Post and Mandal), Anakapalli (Dist.), Andhra Pradesh (State). Pin-531031, have changed my Name and Date of Birth to (New) SACHVATI NAIDU and 25/06/1963 accordingly vide affidavit dated 15/05/2025 sworn before Advocate & Notary B. Balarama Srinivasa Rao, Anakapalle, Andhra Pradesh-531001.